# సీఎం రేవంత్ రెడ్డి ఏడాది

# పాలన సక్సెస్

**హైదరాబాద్,08డిసెంబర్ (తరంగాలు):** అడుగడుగునా కష్టాలు, అధికార పార్టీ నిర్బంధం, ఒకవైపు కక్షసాధింపులను, ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, మరోవైపు కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి, పార్టీకి జవసత్వాలు తెచ్చి, ఏకతాటిపై నడిపించి, అధికారంలోకి తెచ్చి విజయవంతంగా ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పదునైన వ్యూహరచనతో పార్టీలోని అన్ని గ్రూపులను సమన్వయం చేసుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చి, అధికార పగ్గాలు చేపట్టి, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని, మంత్రిగా అనుభవం లేకున్నా, సీఎం పీఠం అధిరోహించి, తనదైన శైలిలో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నివర్గాల ప్రశంసలందుకుంటున్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వలన రాష్ట్ర ఖజానా ఖాళీ అయింది. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేని దుస్థితి వచ్చింది. పాత ప్రభుత్వం కాలంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు 60 వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లించాల్సిన బకాయిలున్నాయి. ఈ చిక్కుముడులన్నింటినీ ఒక్కొక్కటిగా విప్పుకుంటూ ముందుకు సాగుతున్నది రేవంత్ సర్కారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా ఏడాది అవుతున్నది. ఇంత స్వల్ప కాలంలోనే దాదాపు 60 వేల కోట్ల రూపాయలు సంక్షేమానికి ఖర్చు పెట్టిన రేవంత్ తనదైన మార్కును, మార్పును కనబరిచారు. కేంద్రంతో సత్సంబంధాలు నెరుపుతూ తెలంగాణ అభివృద్ధి కొరకు పాటుపడుతున్న సీఎం రేవంత్ రెడ్డిని చూసి ప్రతిపక్ష నేతలు సైతం ప్రశంసించక తప్పడంలేదు.

## జాబ్ క్యాలెండర్తో ఉద్యోగాలు...

నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలండర్ ప్రకటించి, ప్రభుత్వశాఖల్లో ఖాళీలను గుర్తించి, ఒక్కొక్క నోటిఫికేషన్ ఇస్తూ ఉద్యోగాల భర్తీ కార్యక్రమాన్ని సక్సెస్ ఫుల్ గా అమలు చేస్తున్నారు. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు సీఎం రేవంత్ రెడ్డి.

## అన్నదాతలకు ఆపన్న హస్తం

దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఏకకాలంలో ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి, అన్నదాతలకు ఆపన్న హస్తం అందించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అనడంలో సందేహం లేనే లేదు. ప్రతిపక్షాల కువిమర్శలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ, వారి దుష్ప్రచారాన్ని తిప్పకొడుతూ, వారి కుయుక్తులను చిత్తు చేస్తూ, ప్రజల ముందు ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులను దోషులుగా నిలబెట్టడంలో సీఎం రేవంత్ రెడ్డి సఫలీకృతుడయ్యాడు.



ముఖ్యమంత్రి పదవి అనేది అలంకార ప్రాయం కానేకాదు, కష్టపడి పనిచేసి, తెలంగాణ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యం, తపన అని స్పష్టంగా చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి, దాన్ని చేసి చూపిస్తున్నాడు. ఏడాది క్రితం 2023 డిసెంబర్ 7 నాడు తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు రేవంత్ రెడ్డి. అపుడే రబీ సీజన్ ప్రారంభమైంది. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 2024 జూన్ లోగా దాదాపు 7 వేల కోట్ల రూపాయల రైతుభరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో వేసి తన మాట నిలబెట్టుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. తాము రైతులకు మేలు చేశామని గొప్పలు చెప్పుకున్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాదిలో రైతుబంధు కోసం 14 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే, అదే ఏడాది సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 7 వేల కోట్ల రూపాయల రైతు భరోసా ఇవ్వడమే గాకుండా, మరో 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసింది. ఇలా ఏడాదిలోనే బీఆర్ఎస్ ప్రభుత్వానికంటే ఎక్కువగా, రైతుల కోసం మొత్తంగా 25 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే నిజమైన రైతు ప్రభుత్వమని స్పష్టంగా నిరూపించారు రేవంత్ రెడ్డి. ఈ విషయాలన్నింటినీ అర్థం చేసుకొని రైతు భరోసా, రుణమాఫీ విషయంలో విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.రైతులు పండించిన వరి పంటకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్వింటాలుకు 1500 -1600 రూపాయలు చెల్లిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాలుకు 2100-2200 రూపాయల ధర చెల్లిస్తూ రైతులకు లాభం చేకూరుస్తున్నది. కాల్వలు, చెరువుల ఆక్రమణ, వనరుల విధ్వంసం నివారణకు తీసుకొచ్చిన హైడ్రా, మూసీ ప్రక్షాళన, పునరుద్ధరణ విషయంలో కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తే, బీఆర్ఎస్ పసలేని ఆరోపణలు చేస్తున్నది. తెలంగాణలో అన్నిరంగాల అభివృద్ధి ఆగిపోయిందని, రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతిన్నదని ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తూ, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ను చెడగొడుతున్నాయి. వాస్తవంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఆర్థిక సంక్షోభం తలెత్తి సమస్యలు వస్తే, అవి ఒక్క తెలంగాణలోనే వచ్చినట్లుగా ప్రతిపక్షాలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయి.కానీ, గత ప్రభుత్వ పెద్ద ఓసారి మీడియా అధిపతితో చిట్ చాట్ లో మాట్లాడుతూ తెలంగాణలో తమ సామాజిక వర్గానికి చెందిన దాదాపు 200 మందిని లక్షల కోట్లకు అధిపతులను చేయడమే లక్ష్యమని చెప్పాడు, చివరికి ప్రజాధనం వారికి దోచిపెట్టి, అన్నమాటను చేసి చూపించాడు. వారు చేసిన దోపిడీతో తెలంగాణ సంపద అంతా దొరలగడీల్లో బందీ అయిందనడంలో అతిశయోక్తి లేదు.

## సుందర మూసీగా పునరుద్ధరించి భావితరాలకు అందించాలి..

ఇక మూసీ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో పడ్డాయి. ఈ రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు మూసీని బాగుచేసే పనికి గానీ, కోర్టులిచ్చే తీర్పులకు గానీ, ప్రభుత్వ మిచ్చే జీవోలకు గానీ అనుకూలమా, వ్యతిరేకమా తేల్చుకోవాలి. అనంతగిరి కొండల్లో పుట్టి 240 కి.మీ. ప్రవహిస్తూ, తాగు, సాగు నీటిని కలుషితం చేస్తూ, ప్రజల ఆరోగ్యానికి హాని చేసే అధికారం మనకు ఎవరిచ్చారో ప్రతిపక్షాలే సమాధానం చెప్పాలి. మూసీని వ్యర్థాలతో మురికి కూపంగా వారిని అడ్డుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందా, లేదా ప్రతిపక్షాలే చెప్పాలి. మూసీని మురికికూపంగా మారుస్తున్న వారెవరైనా సరే, ముమ్మాటికీ పర్యావరణ ద్రోహులే అని మనమంతా గుర్తెరిగి మసలుకోవాలి. మూసీని ప్రక్షాళన చేసి, భావి తరాలకు సుందర మూసీగా పునరుద్ధరించి అందించాల్సిన బాధ్యత మనందరం తీసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వానికి మనమంతా సహకరించాలి.

గత బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే సంక్షేమం అని గుర్తుంచుకోవాలి. ప్రజల ఆకాంక్షలు గుర్తించి తెలంగాణ ఏర్పాటు చేసిందే కాంగ్రెస్ పార్టీ అని ఏ ఒక్కరూ మరవొద్దు. దేశంలోని అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలను హైదరాబాద్ లోనే నెలకొల్పి, దక్షిణ భారతదేశానికి తెలంగాణను మణిహారంగా తీర్చిదిద్దడంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ కృషిని మనమంతా అభినందించాలి.

తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ది, ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలూ శ్రమిస్తున్న శ్రామికుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మనమంతా అండగా నిలుద్దాం. రాష్ట్ర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోవడంలో మన వంతుగా సహకరిద్దాం. ఇది చారిత్రక అవసరం.



**టీపీసీసీ అధికార ప్రతినిధి**
**బండి సుధాకర్ గౌడ్**